క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో శిఖరస్థాపన పూజలు



నిర్వాహకులకు శిఖరాన్ని అందజేస్తున్న దాత

కడ్తాల్: మండల కేంద్రం సమీపంలోని హనుమాన్‌ఘడ్ ఆంజనేయ స్వామి ఆలయ శిఖర స్థాపన పూజలు వేద పండితులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన సిరిగిరి రమేశ్ చారి కుటుంబ సభ్యులు.. ఆలయానికి శిఖరాన్ని సమకూర్చారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్వాహకులకు అందజేశారు. అనంతరం అలయ కమిటీ శిఖర దాతను ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, భక్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద పలువురికి మంజూరైన చెక్కులను సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నాయకులు అందజేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో చెక్కులు మంజూరయ్యాయని నాయకులు పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు ఖాదర్, రామకృష్ణ, నాజర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు

కడ్తాల్: సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కరోనా కష్ట కాలంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి, దేశంలోనే తెలంగాణ పల్లెలకు గుర్తింపు తెచ్చిన సర్పంచ్‌లకు, బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన ప్రతిపక్ష నాయకుడు, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేలుకుని సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బిల్లులు అందక ఆత్మహత్యలు చేసుకున్న సర్పంచ్‌ల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

మల్లికార్జునుడి సన్నిధిలో ఉత్సవాలు షురూ

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి మునగనూర్‌లోని భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి దేవాలయంలో సోమవారం నవగ్రహ, నంది విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, రక్షాబంధం నిర్వహించారు. 17న యాగశాల ప్రదక్షిణ, మండప దేవత ప్రాతకాల పూజలు, అభిషేకం, హోమాలు, 18న ఉదయం 9.29 గంటలకు నవగ్రహ, నంది యంత్ర ప్రతిష్ఠ, బలిహరణ, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రజాసేవలో లయన్స్‌క్లబ్ ఆదర్శం

ఆమనగల్లు: ప్రజాసేవలో లయన్స్‌క్లబ్ ఆదర్శంగా నిలుస్తోందని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యం శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య సహాయకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 45 మందికి కంటి పరీక్ష చేశారు. ఇందులో 15 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మరణానంతరం నేత్రదానం చేయాలని, ఒకరి నేత్రదానంతో ఇద్దరికి కంటి చూపు వస్తుందని పేర్కొన్నారు. క్లబ్ కార్యదర్శి మహేశ్, జిల్లా చైర్మన్ రమేశ్, పీఆర్‌ఓ పాషా, డాక్టర్ పరీక్షిత్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

ఆమనగల్లు: మండల పరిధి శెట్టిపల్లి, ఆకుతోటపల్లి గ్రామాల నర్సరీలను సోమవారం ఎంపీడీఓ కుసుమమాధురి పరిశీలించారు. వన మహోత్సవానికి మొక్కలను సిద్ధం చేయాలని నిర్వాహకులకు సూచించారు. నర్సరీల్లో ఎర్ర మట్టిని శుభ్రం చేసి, పాలిథిన్ కవర్లలో నింపాలని చెప్పారు. కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది, కూలీలు ఉన్నారు.

చివరి దశకు ధాన్యం కొనుగోళ్లు

- పూర్తికావచ్చిన ప్రక్రియ..
- వారం రోజుల్లో కేంద్రాలను మూసివేసే అవకాశం
- రెండువారాల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ
- మండలంలో 7,870 క్వింటాళ్ల సేకరణ



చింతపట్ల ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి రవినాథ్

యాచారం: 'వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లు పూర్తికావచ్చాయి. వారం రోజుల్లో కేంద్రాలను మూసివేసే అవకాశం ఉంది. దిగుబడి నిల్వ ఉన్న రైతులు.. వెంటనే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి' అని వ్యవసాయ శాఖ అధికారులు కోరుతున్నారు.

4,120 ఎకరాల్లో వరి సాగు

యాచారం మండలంలోని 24 గ్రామాల్లో వానాకాలం సీజన్‌లో 4,120 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. సీజన్ ప్రారంభంలో వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు వరినాట్లు ఆలస్యంగా వేశారు. ఆ తర్వాత కాలం కలిసి రావడంతో వరి బాగా సాగైంది. నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, కిషన్‌పల్లి, చింతపట్ల, తమ్మలోనిగూడ, నందివనపర్తి, నక్కర్తమేడిపల్లి, గునుగల్, చింతుల్ల, అయ్యవారిగూడ, తాడిపర్తి, నస్దిక్‌సింగారం తదితర గ్రామాల్లో వరిని అత్యధికంగా పండించారు. స్థానికంగానే ధాన్యం కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో యాచారం, నందివనపర్తి, చింతపట్ల, మంతన్‌గౌరెల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది.

7,870 క్వింటాళ్ల సేకరణ

మండల పరిధిలో ఏర్పాటు చేసిన నాలుగు కొనుగోలు కేంద్రాల్లో 177 మంది రైతుల నుంచి 7,870 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించారు. మండలంలో 4,120 ఎకరాల్లో వరి సాగు చేయగా.. ఎకరాకు 20 క్వింటాళ్ల వరకు ధాన్యం పండే అవకాశం ఉంది. దీంతో సుమారు 80 వేల క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చినట్లు పలువురు రైతులు, అధికారులు పేర్కొంటున్నారు.

10వేల క్వింటాళ్లకు పైగా దళారుల పాలు

కొనుగోళ్ల ఆలస్యం వరి పంటను ముందే కోసిన కొందరు రైతులు.. 10 వేల క్వింటాళ్లకు పైగా ధాన్యాన్ని దళారులకు విక్రయించారు. కేంద్రాల్లో 7,870 క్వింటాళ్ల ధాన్యం విక్రయించగా, మిగతా దిగుబడిని రైతులు తమ ఇంటి అవసరాల కోసం కొంత, మరికొంత ధాన్యాన్ని విక్రయించడానికి ప్రణాళిక చేసుకున్నారు. ప్రభుత్వం క్వింటా ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, సాధారణ గ్రేడ్ రకానికి రూ.2,300లుగా మద్దతు ధరతో సేకరించింది. దళారులు మాత్రం క్వింటాల్‌కు రూ.1,800లు చెల్లించి కొనుగోలు చేశారు.

పక్షం రోజుల్లోనే..

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన పక్షం రోజుల వ్యవధిలో బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కావడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. నాలుగు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన వారిలో 80 మందికి పైగా వారి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. గతంలో ధాన్యం విక్రయించిన నెల రోజులు గడిచినప్పటికీ.. డబ్బులు జమ కాక రైతులు ఆందోళనలు సంఘటనలు లేకపోలేదు. ఈ ఏడాది మాత్రం రెండు వారాల వ్యవధిలోనే డబ్బులు రావడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. తేమ శాతం, నింబంధనల పేరుతో అధికారులు కొద్దిగా ఇబ్బందులకు గురి చేసినా.. డబ్బులు సకాలంలో జమకావడం సంతోషంగా ఉందని రైతులు తెలిపారు.

సంతోషంగా ఉంది



యాచారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో 55 క్వింటాళ్ల ధాన్యం విక్రయించాను. కొనుగోలు సమయంలో నింబంధనల పేరుతో ఇబ్బంది పెట్టారు. కేంద్రం వద్దే రెండు, మూడు రోజులు ధాన్యం ఎండబెట్టి విక్రయించాను. ఆ తర్వాత 15 రోజుల్లో మా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అయ్యాయి. సంతోషంగా ఉంది.
– మారేడుపల్లి అనిత, రైతు, తక్కళ్లపల్లి

త్వరగా విక్రయించండి



ఇంకా ధాన్యం నిలువ ఉండి, విక్రయించాలని అనుకునే రైతులు వారం రోజుల వ్యవధిలో కొనుగోలు కేంద్రాల్లో విక్రయించండి. నాణ్యత, తేమ విషయంలో నింబంధనలు అమలు చేస్తాం. వడ్లను విక్రయించిన 15 రోజుల్లో డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా కృషి చేస్తున్నాం.
– రవినాథ్, మండల వ్యవసాయ అధికారి

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరం

- దరఖాస్తుల అనంతరం లబ్ధిదారుల గుర్తింపు
- వెల్లడించిన అధికారులు
- అర్జీదారుల వివరాలు ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తం



ఆమనగల్లు: ఆకుతోటపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మాధురి

ఆమనగల్లు/కడ్తాల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరంగా సాగుతోంది. ప్రజాపాలనలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఎంపీడీఓలు, కమిషనర్లు తదితర అధికారులు సోమవారం దరఖాస్తు దారుల ఇళ్లకు వెళ్లారు. వివరాలు సేకరించి ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నిక్షిప్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హులను ఎంపికచేస్తామని పేర్కొన్నారు. ఆమనగల్లులో మున్సిపల్ కమిషనర్ వసంత.. పుర పరిధి నుచ్చుగుట్టతండాలో దరఖాస్తుదారుల వివరాలు సేకరించారు. ఎంపీడీఓ మాధురి ఆకుతోటపల్లి, కొత్తకుంటతండా, శెట్టిపల్లి, పోలెపల్లి గ్రామాల సర్వేలో ఎంపీడీఓ పాల్గొన్నారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కృష్ణనాయక్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

మండల పరిధి గ్రామాల్లో సర్వే అధికారులు ఇందిరమ్మ దరఖాస్తు దారుల వివరాలు సేకరించారు. ప్రస్తుతం ఉంటున్న ఇంటి స్వరూపం, గదులు, పైకప్పు తదితర వాటిని పరిశీలించారు. వివాహ స్థితిని తెలుసుకున్నారు. ఇల్లు నిర్మించుకునేందుకు అవసరమైన స్థలం ఉందా, ఉంటే వాటికి సంబంధించిన పత్రాలు పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి అల్లాజీ, నాయకులు రవి, విజయ్, చందు, శ్రీకాంత్ ఉన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ట్రస్ట్ ధ్యేయం



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్ తదితరులు

కడ్తాల్: పేదల ప్రజల ఆరోగ్య పరిరక్షణే ఉప్పల చారిటబుల్ లక్ష్యమని, వారికి నిరంతరం వైద్య సేవలందిస్తున్నామని మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. సోమవారం మండల పరిధి అన్మాస్‌పల్లి గ్రామంలో ఉప్పల, రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కామినేని ఆస్పత్రి డాక్టర్ అఖిల్ నేతృత్వంలో వైద్య బృందం 225 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, రాధాకృష్ణ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన సిబ్బంది సమ్మె



ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం చేస్తున్న విద్యార్థినులు



వంట గదికి తాళం

- తెరుచుకోని పాకశాలల గదులు
- ఇంటి భోజనం చేసిన విద్యార్థులు

యాచారం: వంట సిబ్బంది సమ్మెతో విద్యార్థులకు పస్తులు తప్పలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యస్తున్న బాలబాలికలకు మధ్యాహ్న భోజనం అందించే నిర్వాహకులు, బిల్లులు రాలేదంటూ.. కలెక్టర్ వద్ద సోమ, మంగళవారాల్లో సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో మండల పరిధి 24 గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల వంట గదులకు తాళం పడింది. కొన్ని పాఠశాల ఉపాధ్యాయులు కొంత మంది విద్యార్థులకు వంట చేసి పెట్టగా, మరికొన్ని చోట్ల వండలేదు. కొందరు చిన్నారులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకోగా.. మరికొందరు కడుపుమాడ్చుకున్నారు. మండలంలో పది ఉన్నత పాఠశాలలు, ఒక ఆదర్శపాఠశాల, 6 ప్రాథమికోన్నత, 32 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. సుమారు 4,500 మంది విద్యార్థులు ఉన్నారు. వంట సిబ్బంది సమ్మెతో సగానికి పైగా విద్యార్థులు పస్తులతో విద్యనభ్యసించారు. ఇదే విషయమై మండల విద్యాధికారి పాండురంగారెడ్డిని వివరణ కోరగా.. సిబ్బంది సమ్మెతో విద్యార్థులను ఇంటి నుంచి భోజనం తెచ్చుకొమ్మని తెలిపినట్లు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు.

చర్చి నిర్వాహకులపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు

కడ్తాల్: అక్రమంగా చర్చిని నిర్వహించడమే కాకుండా.. డిజే పాటలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీ వాసులు పలువురు సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శబ్దకాలుష్యంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని పేర్కొన్నారు. ఇదే విషయమై పలుమార్లు నిర్వాహకులతో మాట్లాడినా.. గొడవకు దిగుతున్నారని పేర్కొన్నారు. రోడ్డుకు అడ్డంగా వాహనాలను నిలిపి రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారని వెల్లడించారు. బడుగు బలహీన వర్గాల వారిని టార్గెట్ చేస్తూ, మత మార్పిడిలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు భగీరథ్, బీజేపీ జిల్లా నాయకుడు రవీందర్‌రెడ్డి, నాయకులు కుమార్, అంజయ్య ఉన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా రాములయ్య



ఆమనగల్లు: టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా తలకొండపల్లి మండలం గట్టుప్పలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న బొడ్డుపల్లి రాములయ్యను నియమించారు. షాద్‌నగర్ పట్టణంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మహాసభల్లో ఎన్నుకున్న కమిటీలో తలకొండపల్లి, ఆమనగల్లు మండలాలకు చెందిన పలువురికి చోటు దక్కింది. జిల్లా కార్యదర్శిగా రాములయ్య, యూటీఎఫ్ ప్రచురణల జిల్లా కమిటీ కన్వీనర్‌గా ఎం.విష్ణుమూర్తి, ఆడిట్‌కమిటీ సభ్యుడిగా ఆంజనేయులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన సభ్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

లచ్చిరెడ్డికి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న లచ్చిరెడ్డి

మంచాల: మండలం పరిధి తాళ్లపల్లిగూడ గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డిని బహుజన సాహిత్య అకాడమి ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డు వరించింది. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో ఆయనకు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధకృష్ణ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అవార్డు మరింత బాధ్యత పెంచిందని, ప్రజాసేవ కార్యక్రమాలు విస్తృతం చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో అకాడమి కమిటీ సభ్యుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

ఆమనగల్లు: లగచర్ల ఘటనలో గిరిజన రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి జైలులో ఉంచిందని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం పట్టణంలో ధర్నా చేపట్టనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్నాలో గిరిజనులు, శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జయమ్మ

మంచాల: కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కలిసి కట్టుగా పని చేయాలని పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గుండమోని జయమ్మ అన్నారు. సోమవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. నామినేటెడ్ పదవుల విషయంలో సీనియర్లకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి అధిష్టానం తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పార్టీలో గ్రూప్ రాజకీయాలకు తావు లేకుండా ముందుకు సాగాలని, ఏది ఏమైనా పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్ పాల్గొన్నారు.